# మినీ కథ

# మిస్టర్

ఆ మాట విన్న అమ్మాజీ. పరాంకుశం వైపు వింతజంతువుని చూసినట్టు చూసింది. తనకు నచ్చిన వ్యక్తి అలా మాట్లాడుతూంటే కొద్దిక్షణాల వరకూ ఏమనాలో తోచలేదు ఆమెకి! కంట తడిపెట్టుకుని, చివరికి అంది. తలవంచుకుని

"నీకు పిచ్చెక్కింది". పరాంకుశం సమాధానం చెప్పలేదు.

గుమ్మందగ్గర అలికిడైతే ఇద్దరూ అటువైపుచూసారు. శ్రీకంఠం వస్తూ కనిపించాడు. అమ్మాజీ అతనివైపు చూసి పలకరింపుగా నవ్వాలనుకుంది. కానీ ఆమెకి నవ్వు రాలేదు. ఏడుపొచ్చింది!!

శ్రీకంఠం, 'ఏమైంది?' అని ప్రశ్నించకుండానే పరిస్థితిని గ్రహించాడు. అవును మరి. పరాంకుశంతో అతని స్నేహం ఈనాటిదా?

"నీ నిర్ణయం మారదా?" ప్రశ్నించాడు. శ్రీకంఠం పరాంకుశం నుద్దేశించి.

"మారదు" ముక్తసరిగా జవాబిచ్చాడు పరాంకుశం.

వలవలా ఏడుస్తూ అక్కడనుంచి వెళ్ళిపోయింది అమ్మాజీ. ఆమె వెళ్ళిపోయింతరువాత అడిగాడు శ్రీకంఠం, కుర్చీలో కూచుంటూ—

"నీకసలు బుద్ధుందా?"

దానికి పరాంకుశం కోపంగా అతనివైపు చూశాడు.

మళ్ళీ శ్రీకంఠం అన్నాడు—

"నీకు మతి పోయింది"

ఈసారి పరాంకుశం తారాస్థాయిని చేరుకుంది.

"ఇంతకీ నేనేం 'తప్పు' చేసానని ఇంత రాద్ధాంతం చేస్తున్నారు? నేనెవరికీ 'అన్యాయం చెయ్యలేదే?' అడిగాడు పరాంకుశం. ఒక కాఫీకప్పు శ్రీకంఠానికి అందిస్తూ.

"తప్పు చేసావని కాదు.. చేయబోతున్నావని చెబుతున్నాం. ఒక వ్యభిచారిని పెళ్ళి చేసుకుంటాననటం, బుద్ధిలేని పని కాదా?" అడిగాడు శ్రీకంఠం.

"నా పెళ్ళి... నా ఇష్టం" చెప్పాడు పరాంకుశం కోపంగా.

"అయితే, అఘోరించు" అంటూ అక్కడనుంచి గబగబా నడుచుకుని వెళ్ళిపోయాడు శ్రీకంఠం.

* * *

"ఏంటి బుల్లోడా! నన్ను పెళ్ళిచేసుకుంటావా?" అడిగింది వాసంతి. పరాంకుశాన్ని కౌగిట్లో బంధిస్తూ.

"అవును" చెప్పాడు పరాంకుశం. ఆమె నుంచి విడిపించుకోవటానికి ప్రయత్నం చేస్తూ.

"నా దగ్గర కొచ్చినోళ్ళందరూ ఇదే మాటంటారు సుఖం పొందేదాక. తరువాత మరి మళ్ళీ కనిపించరు."చెప్పింది వాసంతి.

"అలాగ కాదు, నేను నిజంగానే చెబుతున్నాను" చెప్పాడు పరాంకుశం సిన్సియర్‌గా.

"ఓహో! నిజంగానే పెళ్ళి చేసుకుంటావన్న మాట. కాకపోతే, పెళ్ళైన తరువాత నాచేత బిజినెస్ చేయిస్తావంతేగా?" అడిగింది వాసంతి నవ్వుతూ.

పరాంకుశం దవడ కండరం బిగుసుకుంది. అతనికి తెలుసు ఆక్షణంలో అతనేం చెయ్యలేడని.

* * *

వాసంతి, పద్మ, నీరజ, జలజ, సుకుమారి, సులక్షణ, సుగాత్రి, సులేఖ, ఎందరో వ్యభిచారులు... అందరిదీ అదే సమాధానం!!

"చూడు పరాంకుశం! పెళ్ళి పేరిట మమ్మల్ని మోసం చెయ్యలేవు సుమా!" అన్నట్టున్న చూపులు... అందుకే పరాంకుశం నిర్ణయంలో కొంచెం మార్పు చెయ్యబడింది.

* * *

"నన్ను పెళ్ళి చేసుకుంటావా?" ఆశ్చర్యంగా అడిగింది వనజ పరాంకుశాన్ని. ఆమె సరిగ్గా నడవలేదు. ఆమెకి పోలియో!

"అవును" అన్నాడు పరాంకుశం.

"ఓహో! పెళ్ళిపేరిట నన్నునుభవించాలని చూస్తున్నావా?" అడిగింది వనజ.

"ఛ! అలాంటిదేంకాదు. నీకంత అనుమానంగా ఉంటే, పెళ్ళి అయ్యేంతవరకు నేను నిన్ను తాకను" చెప్పాడు పరాంకుశం.

"అంటే, నీలో ఏదో లోపం ఉందన్నమాట. దాన్ని కప్పిపుచ్చుకోవటానికా ఈ ప్లాను?" అడిగింది వనజ.

పరాంకుశం ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. కోపంగా ఆమెవైపు చూసి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

* * *

పరాంకుశం, మరో బీదింటి పిల్లనడిగాడు



# పరాంకుశం!

పెళ్ళిచేసుకుంటానని. దానికామె—

"వద్దుబాబూ! మా లాంటోళ్ళం మీకు తగం" అంది.

పరాంకుశం ఎన్నో విధాల నచ్చజెప్పి చూసాడు. కానీ ఫలితం శూన్యం.

ఆ బీదింటి పిల్ల భయపడ్డది. పెళ్ళి చేసుకున్న తరువాత కట్నం తేలేదని హింసిస్తాడనీ, బీదింటి పిల్లవని హేళన చేస్తాడనీ, అందుకే పరాంకుశాన్ని తిరస్కరించింది.

* * *

"ఎంత?" అడిగాడు పరాంకుశం ఆయన్ని.

"తొంభై వేలు" చెప్పాడాయన.

"లక్షా, యాభై వేలిస్తేకానీ, మీ పిల్లని పెళ్ళి చేసుకోను" చెప్పాడు పరాంకుశం.

"సరే" ఒప్పుకున్నాడాయన.

* * *

రంగరంగ వైభోగంగా, లాంఛనాలతో లక్షణంగా జరిగిపోయింది... పరాంకుశం పెళ్ళి!! లక్షాయాభై వేలు 'కట్నం' క్రింద తీసుకున్నాడు పరాంకుశం.

శోభనం గదిలో మంటని చూసి ఉలిక్కిపడ్డది అమ్మాజీ! ఆ మంటలో కాలుతున్న వస్తువు— 'కట్నం' పేరుతో తీసుకున్న కేష్‌బాక్స్.

ఆ మంటవైపు చూస్తున్న పరాంకుశం కళ్ళలో కోపం, ద్వేషం, కసి, కనబడుతున్నాయి! ఆ చూపులు—

"ఓ సమాజమా! నువ్వు కుళ్ళిపోయావు. నీనిండా కుళ్ళే. ఒకమంచిపని చేద్దామంటే- అడుగడుగునా అడ్డంకులే!" అన్నట్టున్నాయి.

మంట ఆరిపోయింతరువాత, ఆనందంగా శ్రీమతి అమ్మాజీపరాంకుశంవైపు అడుగులు వేసాడు పరాంకుశం!

—టి.పి. వరదరాజ్
మిడిల్ స్ట్రీట్
సింహాచలం
విశాఖపట్నం-530 028.

## ఫర్ యువర్ ఇన్ఫర్‌మేషన్

తెలిస్తే చెప్పుకోండి.

1) ప్రపంచంలోకెల్లా పెద్ద పార్క్ ఏది? ఎక్కడుంది?

2) పెద్ద మ్యూజియం?

3) ప్రపంచంలోకెల్లా పొడవైన రైల్వే ప్లాట్‌ఫారం?

4) పెద్ద పిచ్చాసుపత్రి?

5) ప్రపంచంలోకెల్ల పెద్ద చెరసాల?

-జి. విజయలక్ష్మి (నెల్లూరు)

(సమాధానాలు 30వ పేజీలో చూడండి)

## వక్ర దృష్టి — మినీ కథ

"ఇది విన్నారూ?"

"ఏమిటీ?"

"రంగారావుగారబ్బాయి..."

"ఎవరూ?... అ రింగుల జుత్తు..."

"ఆ... అతనే... ఎవర్నో తెచ్చుకున్నాడట".

"పెళ్ళాం ఉండగనే!"

"ఇది మరీ చోద్యం. ఆ సంగతీ తెలవదూ? ఈ మధ్యనే పోయిందిగా!"

"నిజమే?"

"కాన్పు కష్టమై తల్లీ బిడ్డా..."



"పాపం!"

"అందుకే..."

"తప్పేముందీ? చిన్నవయస్సు. అలాగే ఉంటాడూ?"

"ఇంకో విషయం విన్నావూ?"

"చెప్పండే..."

"కరణంగారి అమ్మాయి కూడా..."

"ఎవరూ? సంవత్సరం తిరక్కముందే మొగుడు చని..."

"ఆ... ఆపిల్లే"

"ఏం జరిగిందీ?"

"తనూ అలాగే..."

"లేచి పోయిందీ?"

"చిన్న వయస్సు అలాగే ఉంటుందీ?"

"ఎందుకుంటుందీ? అల్లాంటి ముండలు ఉండబట్టే లోకం ఇల్లా తయారైంది. హవ్వ! ఎంత చోద్యం కాకపోతే. మొగుడు చచ్చిన ముండకు ఈ పోకడలేమిటీ? సన్నాసిముండ. దీన్ని లేపుక పోయినోడు వాడెంత సన్నాసి వెధవో?"

"అందరూ అనుకుంటున్నారు..."

"ఏమనీ? ఈసంగతేనా? అనుకోరుమరి"

"అలాగని కాదు."

"మరి..."

"రంగారావుగారబ్బాయి తెచ్చుకుంది ఆ పిల్లనే అని..."

"ఆ...!"

—సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
కేరాఫ్ సిటిజన్ టైలర్స్
పోరుమామిళ్ళ
బద్వేలు (తాలూకా) కడప జిల్లా.